

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### తారకమంత్రం

**మా చిన్నప్పటి రోజులేవేరు.** పిల్లలు బళ్ళకీ, ఉద్యోగస్తులు ఆఫీసులకీ వెళ్ళాక, ఎంతో ప్రశాంతంగా వుండేవి మధ్యాహ్నాలు. అమ్మమ్మ తులసికోట దగ్గర గోవిందనామాలు చదువుకుంటూ రవ్వలో, పప్పులో ఎండబెట్టడమో, బాగుచేసుకోడమో చేస్తుండేది. మధ్యాహ్నాలు ఎవరిళ్ళలోనుండీ పెద్ద శబ్దంతో ఏ పాటలూ, డిస్కో మ్యూజిక్కూ వచ్చేవికావు. మహా అయితే 'చిగురాకులలో చిలకమ్మా... మంచిమాట సెలవీయమ్మా" అనో "తోటలో నా రాజు.. తొంగి చూసే వేళ" లాంటివి రేడియోలో వచ్చేవి. ప్రతి మధ్యాహ్నం ఏకాంబరం, చిన్నక్కల కార్మికుల కార్యక్రమంలో "చిన్నక్కా.. ఇది విన్నావా?" అని ఏకాంబరం రాగానే, మన వూళ్ళో ఓ మర్రిచెట్టూ, చుట్టూ బండా, అల్లంత దూరంలో గోవులు కాసుకుంటూ, పిల్లనగ్రోవి ఊదే పిల్లడూ, రావి ఆకుల గలగలలూ, ఆ బండమీద ముచ్చట్ల కోసం పోగయిన పెద్దవాళ్ళూ కళ్ళముందు ఆడేవారు. ఆ రచ్చబండ ఊహించుకోడం ఓ సుందర దృశ్యం.

"అమ్మమ్మా ఏం చేస్తున్నావ్?" అని ఎదురింటి ఫకిరమ్మో, లేదా "బాపనమ్మగారూ ఓసారిటు రండి" అని బూబమ్మగారో, "పిన్నిగారూ" అంటూ అనసూయా వాళ్ళమ్మో మధ్యాహ్నాలు వచ్చేవారు.

ఇంటి సంగతులు ఒకరికొకరు చెప్పుకునేవారు, సమస్యలు చర్చించుకునేవారు. పరిష్కారాలు సూచిస్తే వినేవారు. అమ్మమ్మ లోతుకి దిగిన నవారు మంచం ఎన్నిసార్లు నేసినా లోతుకెందుకు దిగిపోయేదో, నాకిప్పుడు తెలుస్తోంది. అందరూ దానిమీదే చేరి కబుర్లాడేవారు. అమ్మమ్మ వేయించిన పల్లీలో, బటానీలో అప్పుడప్పుడూ మధ్యలో పోస్తుండేది.

మా పక్కింటి భారతమ్మ అరిగె రామస్వామిగారి కోడలు, ఎప్పుడూ తన కోర్టర్‌ని అద్దెకిచ్చి స్వంత ఇంట్లో ఉండేది. మధ్య మధ్యలో వచ్చి "పంతులమ్మా కూరగాయ దండల పెళ్ళిళ్ళు ఈ నెలలో నాలుగు చేయించా. మా విజ్జికీ, బుజ్జికీ, చంటికీ, క్రరిబుజ్జికీ కూడా బాపనబ్బాయిల్నే చేసుకుంటాం అని కాచుకునున్నారనుకో" అని చెప్తుండేది. అచ్చం ఇందిరాగాంధీలా జుట్టు కత్తిరించేసుకునీ, నల్లకళ్ళద్దాలతో, గొడుగుతో తిరిగేది. ఆ ఇల్లు అద్దెకిచ్చినప్పుడల్లా మా పక్కింట్లో కొత్త మనుషులూ, కొత్త కథలూ వచ్చేవి.

బూబమ్మది బందరు. ఒక్కడే కొడుకు, ఆ పిల్లాడు పుట్టాక భర్త పోయాడుట. ఆ కుర్రాడిని పాలిటెక్నిక్ చదివించుకుంది. హైదరాబాదులో ఉద్యోగం అయితే తల్లిని తీసుకొచ్చుకున్నాడు. చక్కగా వుండే "ఆరిఫ్" పెళ్ళి ఎందుకు చెయ్యవూ? ఈ వయసులో నీకీ వంటావార్పూ ఎందుకూ?" అని అమ్మమ్మ అడిగితే, బూబమ్మగారు నిట్టూర్చి, "అవనూ అయింది, వదిలెయనూ వదిలేసాడు. మా అన్న

కూతురు మెహర్‌నిచ్చి నిరుడే పెళ్ళి చేసా, మా అన్న వీడికి పెళ్ళిలో స్కూటర్ పెడ్తా అని పెట్టలేదుట. రంజాన్ పండగకి పిలిస్తే వీడు పోలా, సరే మా అన్నే వచ్చి పిల్లని దిగపెడతానంటే, వీడు వద్దన్నాడు. మధ్యలో మా అన్న నేను వీడికి సర్ది చెప్పలేదని నా మీద చెయ్యి చేసుకున్నాడు. దాంతో వీడు 'నాకు నీ పిల్లా, ఈ పెళ్ళీ వద్దే వద్దని వచ్చేసాడు. అదీ కథ బాపనమ్మగారూ" అని కంట తడిపెట్టింది.

ఆరీఫ్ తెల్లగా పొడుగ్గా సినిమా హీరోలా బావుండేవాడు. మా సందానీకి పతంగి కన్ను తినకుండా పైకి ఎగరెయ్యడం, మాంజా చెయ్యడంలాంటివి నేర్పి గురువయ్యాడు. "ఇంకో పిల్లని చూడు, నీ అన్నకూతురు వద్దు" అన్నాడట ఆరీఫ్. బూబమ్మ వచ్చేస్తుంటే, మెహర్ 'నా చేతులలో మెహందీ ఇంకా ఎర్రగానే వుంది, బావ ఇలా వదిలేస్తే ఎలా అత్తా?" అని కౌగిలించుకుని ఏడ్చిందని, తన తెల్ల రవిక మీద అంటిన మెహర్ కాటుక కంటి నీటి చారికలు చూపించి బూబమ్మ కూడా కంట తడిపెట్టేది.

అమ్మమ్మ "బూబీ నువ్వే నీ అన్నతో మాట్లాడి, సర్దుబాటు చేయించు. పిల్లదాన్ని అన్యాయం చెయ్యకు" అని చెప్పేది.

సందానీ తల్లి బీడీలు చేస్తూ మా వేప చెట్టుకింద కూర్చుని "'తలాక్' అని అనలేదుగా ఆపా అంటే మనసులో ఇష్టమే వుండి వుంటుంది" అని అమ్మమ్మకి వంతపాడేది.

అనసూయ తల్లి వత్తులు చేస్తున్న అమ్మమ్మకి సాయం చేస్తూ "నువ్వొక ఉత్తరం రాయచ్చుగా ముసలమ్మా నీ కెంత గోరోజనం?" అనేది బూబమ్మతో.

బూబమ్మగారి గొంతు కీచుగా, పిల్లి మ్యావ్ అన్నట్టు వుండేది. ఆవిడ తన పొడవాటి చేతులున్న కుర్తీ మీద తెల్ల చీరకట్టుకుని, మధ్యలో కొంగుతో కళ్ళు అద్దుకుంటూ, అచ్చమైన ఆంధ్రా భాషలో "ఈ ప్రబుద్ధుడి బుద్ధి ఇట్లా ఏడుస్తుందని నాకేం తెలుసు? నా అన్న వీడిని పాలిటెక్నిక్ చదివించాడు. నలుగురూ కూతుళ్ళే, కొడుకులా ఆదుకుంటాడనుకున్నాడు. వీడిట్టా దాని రాత కాల్చాడు" అనేది. ఒక్కోసారి అన్నని తిట్టేది కొడుకుని వెనకేసుకొచ్చి.

సందానీ తల్లి అందుకుని "ఆడపిల్ల ఉసురు నీకీ మంచిదికాదు ఆపా. పోయి ఈద్‌కి తెచ్చుకొచ్చుకో.. ఖుదా నీకు మేలు చేస్తయి" అని తన భాషలో చెప్పేది.

"నా బిడ్డ రత్నమాణిక్యం వాడి మనసు తండ్రి నొప్పిస్తే, దీని బుద్ధి ఏమైంది? 'నాన్నా బావ స్కూటర్ కోసం కాదు, మాట కోసం పంతం పట్టాడు. స్కూటర్ ఇస్తామని చెప్పు అని తండ్రికి చెప్పొద్దూ? అసలు మా వదిన మంచిదైతే ఈ గొడవ వచ్చే వుండేది కాదు" అని కొడుకుని వెనకేసుకొచ్చి కాసేపు మాట్లాడేది.

ఆ కొడుకు తల్లి ఏం వండినా తిట్టేవాడు, "నీ మొహంలా వుంది" అని కంచం ముందు నుండి లేచి వెళ్ళిపోయేవాడు. బూబమ్మ కళ్ళొత్తుకుంటూ వాడటు ఆఫీస్‌కి వెళ్ళగానే ఇటు "బాపనమ్మగారూ" అని ప్రత్యక్షం. వీళ్ళ మీటింగ్ మధ్యలో ప్రసారంలో అంతరాయంలా నెయ్యి పోసే తిమ్మయ్య, పెరుగు పోసే నారాయణో, కూరలమ్మే లక్ష్మో, మా పనిమనిషి శ్యామలమ్మో వచ్చి, వచ్చిన పని చేసుకెళ్ళకుండా బాబమ్మ కొడుకు కాపురంలో వేలు పెట్టేవారు.

"నువ్వెళ్ళి నీ కోడల్ని పట్టుకురా. వాడు మాత్రం ఎన్నాళ్ళు నీ వుడికీ వుడకని తిండి తింటాడు. నా జిందగీలో మూడు పెళ్ళిళ్ళు చేసుకున్నా ఒక్క మొగుడు కూడా బతికుండగా నన్ను విడిచిపెట్టి నాలుగు దినాలు వున్నది లే" అని శ్యామలమ్మ జర్దా పాన్ వేసుకుంటూ తన ఎక్స్‌పర్ట్ ఎడ్వైజ్ ఇచ్చేది.

అనసూయ తల్లికి మాలతీ చందూర్‌గారికి తెలిసినన్ని విషయాలు తెలుసు. "కిరోసిన్ ధరలు ఎందుకు పెరిగాయి?" అంటే, "రెండో ప్రపంచ యుద్ధంలో" అంటూ ఆవిడ మొదలు పెట్టేది.

"బెండపూలు రాలిపోతున్నాయి" అంటే అసలు "బెండలో నాలుగురకాలుంటాయి. వాటికి వాడవలసిన ఎరువులు" అంటూ చెప్పుకొచ్చేది.

కానీ ఇలాంటి మొగుడూ పెళ్ళాలు కాపురాల విషయంలో ఆవిడకి కాస్త నాలెడ్జ్ నిల్. చివరికి అమ్మమ్మ తెలుగు కాలెండర్ చూసి మంచిరోజు చెపితే బూబమ్మ మెహర్‌కి "నువ్వొచ్చి నీ కాపురం చక్కపెట్టుకుంటావా? బావకి ఇంకో పెళ్ళి చెయ్యమంటావా?" అని ఉత్తరం రాయించి అమ్మమ్మ చేత పైన 'శ్రీరామా' అని రాసాక పోస్ట్ చేయించింది.

మెహర్‌కి తెలుగు నవలలు అంటే ప్రాణం. పదో తరగతి పాసయి, ఇంట్లో ఖాళీగా వుండకుండా పిల్లలకి ప్రైవేట్లు చెప్పేదిట. అందుకని ఈ అమ్మమ్మ తెలుగు చదవగలదు. "ఈనికి పెద్దరోగం వచ్చిపోయినా బాగుండేది. ఆరొకిలాస్‌ల వున్న మానస్రీంకి లగ్గం చేస్తానంటయ్. ఈని మొకమ్ల నా చెప్పుకాల" అంటూ ఓ రోజు సందానీ తల్లి మొగుడ్ని దండకంతో స్తుతించేవేళ."

"పిన్నిగారూ ఓ గ్లాసెడు కాఫీ పొడి ఇస్తారూ ఫస్ట్‌కి ఇచ్చేస్తా" అని అనసూయ తల్లి గ్లాసుతో వచ్చినవేళ.

"ఆరీఫ్ బయ్యా పతంగ్ ఎగరేస్తయ్?" అంటూ లాగూ ఎగదోసుకుంటూ సందానీగాడు చేతిలో ముప్పై అతుకులతో, వాడికన్నా పొడుగుతోక పెట్టిన పతంగితో వచ్చినవేళ ఆరీఫ్ పెట్లోంచి, కొత్త తెల్ల అంగరఖా తీసి తొడిగి, మంచి మొగలిపూల అత్తరు రాసి "నేను పని మీద పోతున్నా" అన్నాడు.

"ఒరేయ్ చిక్కుడు కాయల ఇగురొండారా తినిపో" అని బూబమ్మ చెప్తూ వుంటే, "నీ చిక్కుడుకాయలు నువ్వే తిను" అని వెళ్ళిపోయాడు.

అమ్మమ్మతోబాటు నేనూ నవారు మంచం నేస్తున్నానావేళ 'మా రచ్చబండ' అదే మరి.

"వీడిదిందేమ్మా ఆదివారం పూట ఇట్టా సోగ్గా తయ్యారయ్యిపోతున్నాడూ?" అని బూబమ్మ అమ్మమ్మ దగ్గరకొచ్చి మీటింగ్ పెట్టింది.

"నాకీ మియా నా బిడ్డ నస్రీంకి లగ్గం చేస్తాయి అంట. వీనికి సారా తాపించే రహమతుల్లా గాడికిచ్చి. ఆ పిలగానికి మూర్చల రోగం వున్నయ్ పంతులమ్మా" అని సందానీ తల్లి ముక్కుతుడుచుకుంటూ కొంగుతో వచ్చింది.

సందానీ ఓ పక్కకి ఎగురుతున్న తన పతంగితో నా దగ్గరకొచ్చి "ఏవీ రమణీ పతంగి ఎగరేస్తయ్?" అని సైగలు చేస్తూ పిలిచాడు.

"ఎగరేస్తా కానీ నీ చక్రీ మాత్రం పట్టుకుని నిలబడమంటే రాను" అన్నాను. వాడంతే సరిగ్గా నేను జోష్‌లో పైకి ఎగుర్తోంది అనుకున్నప్పుడు నువ్వు చక్రీ పట్టుకో నేను పెయించ్ వేస్తా" అని లాగేసుకుంటాడు.

'సరే...రా' అన్నాడు.

నేను అమ్మమ్మ అరుపులు ఖాతరు చెయ్యకుండా సందానీతో పతంగ్ ఎగరేయడానికి పరిగెత్తాను. అమ్మమ్మ బలే మాటలు ఉపయోగించేది. "బూబీ మొగ్గరంగా వుండాలి పిల్లల దగ్గర మనం. వాళ్ళమీద మన ఇష్టాలు రుద్దకూడదు" అనేది.

"మొగ్గరం అంటే మోతాదుగా" అని అర్థంట.

"బబాకరంగా తినకూడదు" అనేది. అంటే "అతిగా తినకూడదు" అని.

"వాడు 'శానీ' పంతులు" అనేది. 'శానీ' అంటే షోకుల రాయుడు అని. అమ్మమ్మ దగ్గర మధ్యాహ్నాలు కూర్చుని పెద్దవాళ్ళ కబుర్లు వినాలంటే నాకు బోలెడిష్టం. అందుకని కడుపునొప్పి వంకతో స్కూల్ డుమ్మాకూడా కొట్టేసేదాన్ని. "పాపం పిల్ల, పొద్దుట తెరిచిన నోరు తెరిచినట్టే వుంది అన్నం తిన్నాక నీళ్ళయినా అడగలేదు" అని అమ్మమ్మ మినప సున్నివుండలో, రవ్వలడ్డూలో, పాకుండలో, కొబ్బరిలౌజ్‌లో చేస్తుండేది. వీటిని 'మూతినాకుడు ముచ్చట్లు' అని మా అన్నయ్యలు విమర్శించినా నేను జ్ఞానం నేర్చుకుంటున్నా అనుకుని ముసలివాళ్ళ బాతాఖానీలో కూర్చునేదాన్ని. మధ్యమధ్యలో "బూబమ్మ కోడలు 'కాపురానికి' రావడంలేదు అంటున్నారు. పోనీ బూబమ్మ ఇంటికి రావచ్చుగా" లాంటి సిల్లీ డౌట్స్ వెలిబుచ్చి, అమ్మమ్మ చేత తొడపాశాలూ, మొట్టికాయలూ అందుకునేదాన్ని.

"కాపురం అంటే ఏంట్రా?" అని సందానీగాడిని అడిగితే, వాడు బుర్రగోక్కుని "గోపురం లెక్క ఇంటి కప్పేమో?" అని సమాధానం చెప్పడం కూడా జరిగేది. పెద్దవాళ్ళు నా డౌట్స్ మాత్రం తీర్చేవారు కాదు.

ఆరోజున 'ఆరీఫ్ ఎక్కడికెళ్ళాడు అత్తరు అద్దుకుని' అని అందరూ తర్జన భర్జన పడుతున్న రోజు సాయంత్రం ఒక షేర్వానీ పెద్ద మనిషితో ఇంటికొచ్చి "అమ్మీ.. యాకుబ్ మియాకి చాయ్ పెట్టు" అన్నాడు. ఆ యాకుబ్‌తో ఓ బేనాబ్‌షా ద్రాక్షపండ్ల మూతవున్న కూజా బుట్టా, ఏపిల్ పండ్లూ, నాగ్ పూర్ సంత్రాలూ, మిఠాయి వుండలూ వున్నాయి. బూబమ్మకి ఏదో కీడు తోచింది. "ఇవన్నీ ఎందుకు తెచ్చారూ?" అంది.

"మా అమ్మాయ్ షాహీన్‌కీ ఆరిఫ్‌కీ నిక్కా చేద్దాం అమ్మా" అన్నాడు జర్దా పాన్ వాసన గుప్పుమంటూండగా.

బూబమ్మకి అన్న అంటే కోపమే కానీ మేనకోడలంటే కాదు. "మా ఆరిఫ్‌కి పెళ్ళయింది. కోడలు పుట్టింట్లో బందర్లో వుంది" అంది.

"బందరమ్మాయి ఇక రాదని ఆరిఫ్ చెప్పాడు. హైదరాబాద్‌లో షాదీ చేద్దాం" అని యాకూబ్ ఎంత నచ్చచెప్పినా బూబమ్మ "ఒక్క పండు వదిలివెళ్ళినా నా శవం చూస్తారు" అనడంతో, ఆయన తెచ్చినవి తీసుకుని వెళ్ళిపోయాడు. ఆరీఫ్ గిన్నెలూ, ప్లేట్లూ విరక్కొట్టాడు. "ముసలిదానా నువ్వూ వెళ్ళి నీ అన్న ఇంట్లో చావు. నా ముందే నీమీద చెయ్యిచేసుకున్నాడు సిగ్గులేదా?" అన్నాడు. ఆమె ససేమిరా ఈ పెళ్ళికి ఒప్పుకోనంది. ఇది జరిగిన మూడోనాటి తెల్లారి, అమ్మమ్మ పారిజాతం చెట్టుకింద పూవులేరుకుంటుండగా, అందరూ పాలసీసాలు పట్టుకుని చీకట్లో పాలకెళ్తుండగా, ఒక టాక్సీ వచ్చి ఆగింది. అందులోంచి, ముసుగేసుకున్న అమ్మాయీ, ఓ పెద్దావిడా, పెద్దాయినా దిగారు. వాళ్ళ డిక్కీ నిండా తెచ్చిన సామాన్లుతో.

బూబమ్మ ఇంట్లోంచి ఏడుపులూ, కూనిరాగాలూ, పెద్ద గొంతులతో మాటలూ వినపడ్డాయి. ఆరీఫ్ కోపంతో అరిచిన అరుపులు కూడా.

చీపురుతో శ్యామలమ్మ వచ్చి "బూబమ్మ కోడలొచ్చింది. బోలెడు సామాన్లు తెచ్చారు. బీరువా, మంచాలు, లారీ మీదొస్తున్నాయట" అంది.

కాఫీ పొడిగ్లాసుతో అనసూయా వాళ్ళమ్మా, ఫకీరూ, సందానీ తల్లీ, కాఫీ తాగుతూ మా అమ్మా, పేపర్ చదువుతూ సుబ్బారావుగారూ అంతా కాసేపు వేపచెట్టుకింద చేరి "ఈ పిల్లాడు వేరే పెళ్ళి చేసుకునే వుద్దేశంలో వున్నాడు. మీరేమో పిల్లని వున్నపళంగా వెంటపెట్టుకురమ్మన్నారు. ఇప్పుడేం అవుతుందో?" అన్నారు, అమ్మమ్మమాట సుప్రీం కోర్టు తీర్పులా. అమ్మమ్మ జత్మలానీలా తలాయించలేదు.

"ఆ పిల్ల తెలివైనదైతే దాని కాపురం అదే చక్కపెట్టుకుంటుంది" అంది.

"నేను వేరే పెళ్ళి చేసుకుంటాను. నీ కూతురికి కూడా వేరేపెళ్ళి చెయ్యి" అన్నాడట ఆరీఫ్.

"నువ్వే చెయ్యి. అది ఈ ఇంటి పిల్ల, మాకు పూచీలేదు. చెల్లీ నీ మీద చెయ్యి చేసుకున్నాను క్షమించు. తండ్రిలాంటివాడిని" అని బూబమ్మ చేతులుపట్టుకుని బతిమాలి మెహర్‌నీ ఆమె సామాన్లనీ వదిలిపెట్టి వెళ్ళిపోయారు ఆ తల్లితండ్రులు.

బూబమ్మ ఆ రోజంతా బయటకి రాలేదు. మర్నాడు అమ్మమ్మ దగ్గర కుక్కి మంచం మీటింగ్‌లో కంటతడి పెట్టి "అది చాయ్ ఇస్తే పారబోసాడు. అన్నం పెడ్తే ప్లేట్ విసిరి కొట్టాడు. మాట్లాడబోతే "మీ 'అబ్బా' కీ నీకూ సిగ్గులేదా? ఎన్నిసార్లు చెప్పాలి నువ్వు నాకొద్దనీ?" అన్నాడు అని ఏడ్చింది.

ఈలోగా మా లక్ష్మక్కా, శాంతక్కా మెహర్‌ని చూసారు. "పాలరాతి బొమ్మలా వుందే. నవ్వితే బుగ్గలు సొట్టపడ్తున్నాయి. వహీదా రెహమాన్‌లా వుంది" అంటూ మెహర్‌ని తెగ పొగిడేసారు.

"అమ్మమ్మగారూ చక్కెరకేళీ అరటి పండ్లు తెచ్చాను తీసుకోండి" అంటూ గోడమీద నుండి మెహర్ అమ్మమ్మని మచ్చిక చేసుకుని, "శాంతా గోరింటాకు రుబ్బుకొచ్చాను, పెట్టుకుంటారా?" అంటూ అక్కలతో అచ్చికబుచ్చికలాడింది.

అమ్మమ్మ బూబమ్మని పిలిచి, పెరట్లో తులసికోట దగ్గర చెవిలో తారక మంత్రోపదేశం చేసింది. సందె దీపం తులశమ్మ గూట్లోంచి కన్నుకొట్టి నవ్వింది.

బూబమ్మ ఓనాడు పొద్దుటే ఆరీఫ్ లేవకముందే "మా పిన్నికి బాగాలేదు. సుస్తీ చేసిందట" అని హడావిడిగా బెజవాడ బండెక్కేసింది.

ఆరీఫ్ మెహర్ ఎదురుపడితే, టీ ఇస్తే, అన్నం పెడ్తే చిర్రుబుర్రులాడాడుట. మొదటిరోజు మూడోనాడు సందానీ లడ్డూ వుండ తింటూ వచ్చి "బాబీజానీ మంచిది. నువ్వూ రా లడ్డూ ఇస్తయ్" అన్నాడు. నేను బెరుగ్గా వాళ్ళింట్లోకి ఆడుగుపెట్టాను. ఆరీఫ్‌కి మెహర్ అన్నం ముద్దలు నోట్లో పెడ్తోంది. ఆమె కొంగుతో మూతి తుడుచుకుంటూ గారాబాలు పోతున్నవాడల్లా, మమ్మల్ని చూసి "ఏరా మీకు ఇల్లిల్లూ తిరగడమేనా? పనీపాటా లేదా?" అన్నాడు.

"ఇందాకా మిఠాయి ఇచ్చిందిగా బాబీజాన్, ఎ.వీ రమణీకి కూడా ఇస్తే పోతయ్" అన్నాడు సందానీ.

మెహర్ "చెయ్యి కడుక్కుని ఇస్తా" అని రాబోతుంటే, ఆరీఫ్ ఆపి, ఆమె జబ్బ పట్టుకుని "సాయంత్రం మొత్తం ప్యాకెట్ ఇస్తా పోండిరా బాబూ. నా కాపురం ఇప్పుడే నిలబడ్తోంది నీళ్ళు పొయ్యకండి" అన్నాడు.

"కాపురం అంటే ఇదే! నోట్లో అన్నం పెట్టుడు" అన్నాడు సందాని

"సమజ్జయే.. సమజ్జయే" అంటూ మేమిద్దరం పరిగెత్తాం.

బూబమ్మ నాలుగు నెలల తర్వాత ఇంటికొచ్చే సరికే మెహర్ నీళ్ళోసుకుందని అమ్మమ్మ చెప్పింది. ఆ సంజెవేళ అమ్మమ్మ బూబమ్మ చెవిలో చెప్పిన తారక మంత్రం ఫలించింది. పెళ్ళయిన కొత్తల్లో పెద్దవాళ్ళు వాళ్ళని ఏకాంతానికి వదిలిపెట్టేయాలనీ వాళ్ళే రాజీ కొస్తారనీ.




Post your comments

రమణిగారితో ఐడ్రీమ్స్ ఇంటర్వ్యూ కోసం ఇక్కడ క్లిక్ చేయండి.

